# విషాదమా? దేవుడి వినోదమా?

ఎస్. మోహనవాలి



సావిత్రమ్మ మళ్ళీ పెళ్ళికూతురైంది!!

నా చేతుల్తో ముస్తాబు చేశాను.

చారడేసి కళ్ళకు కాటుక, ఎర్రని చెక్కిళ్ళపై మంచిగంధం, కాళ్ళకి పసుపూ పారాణి, బారెడు జడకి పూల్జడ.

అంత వయసొచ్చినా ఆమెని చూస్తుంటే ముద్దెట్టుకోవాలనిపిస్తోంది.

ఒకప్పుడు.... సావిత్రమ్మ పెళ్ళికూతురై మా వూరికి వచ్చినప్పుడు పదహారేళ్ళ పిల్ల! ఉయ్యూరు నుంచీ రిక్షాలో కూర్చోబెట్టుకుని మా నాయుడు తీసు కొస్తుంటే ఊరంతా ముక్కు మీద వేలేసుకుంది.

నేనా ఇంట్లో పని మనిషిని. అయినా నన్నెప్పుడూ వాళ్ళు పని మనిషిలా చూడ్లా. నాయుడు నన్ను అక్కా అని పిలిస్తే, తనేమో వదినా అని పిలిచేది.

నాయుడికి పెళ్ళామంటే మహా ప్రీతి. తన ప్రాణమంటే అలుసేమోగానీ సావిత్రమ్మకి రవ్వంత కష్టం కలిగితే అతను తల్లడిల్లిపోతాడు.

నాయుడు చేసేది బస్ కండక్టర్ ఉద్యోగం. విజయవాడ నుంచీ బందరు వరకు లేదా విజయవాడ నుంచీ తిరువూరు వరకు అతని రూటు. ఏ రూటుకెళ్ళినా డ్యూటీ దిగగానే ఇంటికి నేరుగా వచ్చేస్తాడు. చాలీ చాలని జీతం. అయినా ఒకరి దగ్గర దేహీ అంటూ చేయి చాపలేదు. అడిగిన వాళ్ళకి అప్పు ఇవ్వనూ లేదు. అస్సలు అప్పు తెచ్చే పరిస్థితి రాలేదతనికి.

సావిత్రి భర్తని బాగా అర్థంచేసుకుంది. కష్టాలొచ్చినప్పుడు నిబ్బరంగా అతనికి తోడుగా ఉంటూ వచ్చింది.

పెళ్ళయ్యాక చాలా ఏళ్ళకి వాళ్ళకి కొడుకు పుట్టాడు. అప్పుడు వాళ్ళిద్దరిలో ఆనందం కట్టలు తెంచుకుని ప్రవహించింది. పిల్లవాడికి ఏ సమయంలో ఏ ముచ్చట జరపాలో అది జరిపారు. శ్రవణ్ కుమార్ అని ముద్దుగా పేరు పెట్టుకున్నారు. వాళ్ళిద్దరి పూర్వజన్మ సుకృతమో లేక వాళ్ళ సంస్కారమో గానీ మంచి బుద్ధులే అబ్బాయి. నిజంగానే శ్రవణ్‌కుమార్ లాగే తయారయ్యాడు.

తల్లిదండ్రులంటే వాడికి పంచ ప్రాణాలు.

నాయుడు కూడా కొడుకు విషయంలో ఎప్పుడు అశ్రద్ధ చేయలేదు. శ్రద్ధగా చదివించాడు. వాడు బాగా చదువుతుంటే తన కోరికలను చంపుకుని ఇంకా బాగా చదివించాడు. కొడుకుని ఇంజనీయర్‌గా చేశాడు.

కొడుకు ఇంజనీరు హోదాలో ఇంటి నుంచీ ఆఫీసుకి ఆఫీసునుంచీ ఇంటికి జీపులో వెళ్ళి వస్తుంటే సావిత్రమ్మ ముఖంలో చెప్పలేనంత తృప్తి. ఆనందం. ఈ జీవితానికింత అదృష్టం చాలు అన్నట్లు నిట్టూర్పు విడిచేది.

వాళ్ళిద్దరి భవిష్యత్తు కన్న కలలన్నీ కొడుకు మీద్దే పెట్టుకున్నారు.

కొడుకు ఒక్కరోజు ఇంటికి రాకపోతే వాళ్ళిద్దరి మనసులు గిలగిల కొట్టుకునేవి.

శ్రవణ్ కుమార్ ఇంజనీరు అయ్యాడని తెలుసుకున్న వాళ్ళు మా పిల్లనిస్తామంటే మా పిల్లనిస్తామని పోటీ పడుతూ వస్తున్నారు గొప్పగొప్ప వాళ్ళు.

భార్యా భర్తలిద్దరూ సంతోషించారు. ఆపైన బెదిరిపోయారు. గొప్పింటి పిల్లని కోడలిగా తెచ్చుకుంటే కొడుకుని తమ దగ్గరనుంచీ దూరం చేస్తుందేమోనని అనుమానం పడ్డారు. సందేహించారు.

అదేమాట మనసులోని మాట దాచకుండా కొడుకుతో చెప్పుకున్నారు. కన్నీళ్ళు పెట్టుకున్నారు.

"అమ్మా మనం బీదింట్లో పుట్టాము. బీదరికంలో పెరిగాము. మనకు కట్న కానుకలు వద్దు. అందం చందంలేకపోయినా బాధ లేదు. మంచి సంస్కారముంటే చాలు అదే గొప్ప కట్నం" అని కొడుకు చెప్పినప్పుడు వాళ్ళిద్దరికి చాలా ధైర్యమొచ్చింది.

మొగుడూ పెళ్ళాలిద్దరూ మంచి కోడలి కోసం వెదకడం మొదలుపెట్టారు. ఊరూర తిరిగారు. అయిన వాళ్ళందరితో సంప్రదించారు.

అప్పుడు కనిపించింది శ్రీదేవి వాళ్ళకి.

మూడు పూటలు కడుపార తిండి లేని కుటుంబం వాళ్ళది. అయినా ఆ అమ్మాయిలో కావాల్సినంత సంస్కారము కనిపించింది. పెందరాళే లేస్తుంది. వాకిట్లో కళ్లాపి చల్లుతుంది. ముచ్చటైన ముగ్గులు వేస్తుంది. అసలు అభ్యంగన స్నానం చేయందే పని మొదలుపెట్టదు. రాముల వారి గుడికి క్రమం తప్పకుండా వెళుతుంది.

అంతకంటే కావాల్సిందేముంది? సావిత్రి వెంటనే ఒప్పేసుకుంది.

కొడుకు పెళ్ళి నిరాడంబరంగా జరిపేశారు.

సావిత్రికి కోడలంటే విపరీతమైన ప్రేమ. ఆ పిల్లని కోడలిగా చూడడంలేదు. కన్న కూతురిలా చూసుకుంటోంది. వీలున్నప్పుడు కోడలు విడిచిన బట్టలను ఉతికి ఆరవేస్తోంది. కొడుకొచ్చే వేళ కోడలికి వాల్జడ వేసి సన్నజాజులను పెట్టి ముస్తాబు చేస్తోంది.

సావిత్రి కష్టాలన్నీ తీరిపోయాయి. దేవుడిలాంటి పెనిమిటి దొరికాడు. సాక్షాత్తు లక్ష్మీదేవిలాంటి కోడలు దొరికింది. దానికి తోడు బుద్ధిమంతుడైన కొడుకున్నాడు.

పైగా ఇంట్లో ఖరీదైన వస్తువులు వచ్చేసాయి. పేరుకి పెంకుటిల్లు. కానీ, మెత్తటి పరుపు మంచాలు, ఫ్రిజ్, కలర్ టీ.వీ. వగైరా వగైరాలతో ఇప్పుడది ఇంద్ర భవనంలా మారిపోయింది.

నేనారోజు అంట్లు తోముతున్నాను. సావిత్రి బావి దగ్గరున్న నాయుడి దగ్గరకు వచ్చింది. మౌనంగా నిల్చుంది.

నాయుడు ప్రశ్నార్థకంగా చూశాడు.

సావిత్రి కాస్తంత ధైర్యం తెచ్చుకుని "ఏవండీ! మనం పడిన కష్టాలు చాలు. మన కొడుకూ కోడళ్ళి ఎంతకాలం పెంకుటింట్లో కాపురం చేయిస్తాం? మనవాడి ఉద్యోగానికి తగ్గట్టు మిద్దె ఇల్లు కట్టుకుని వాళ్ళిద్దరు చిలకా గోరింకల్లా ఉంటే చూడాలని ఉంది..."


సావిత్ర మాటలు విని నాయుడు మౌనం వహించాడు. ఆలోచనలో పడ్డాడు. భార్య కోరిక అతనికి సబబుగానే తోచినట్లయింది. ఆ మాటే కొడుకుతో చెప్పాడు - ఆ సాయంత్రం.

నాయుడి మాట విని శ్రవణ్ అంతెత్తు లేచాడు..

"ఏమిటీ!? వేరే ఇల్లు కట్టుకుని వేరే కాపురం పెట్టమంటావా? ఎందుకూ? ఏమైందీ?? నీకు. నేనేం తప్పు చేశానని నన్ను వేరు చెయ్యాలని చూస్తున్నావ్.."

"అది కాదురా...."

"ఇంకేం మాట్లాడబాకు. ... మరోసారి ఆమాట ఎత్తకు. ఈ ఇంట్లో పుట్టాను. ఈ ఇంట్లో పెరిగాను. ఈ ఇంట్లోనే ఉంటాను. అంతే..."




సార్థక నామధేయుడు!!

సావిత్రికి ఒక ప్రక్క సంతోషం మరో ప్రక్క దుఃఖం వచ్చేసింది. ఆ విషయం దాచుకోలేక మొగుడి ముందు కళ్ళనిండా ఆనందభాష్పాలు తెచ్చుకుని జలజల రాల్చేసింది...

ఆ సంఘటన జరిగిన నెలరోజులకి నాయుడుకి అరవైయేళ్ళు నిండాయి. రిటైరయ్యాడు. షష్ఠిపూర్తి చెయ్యాలని కొడుకు పట్టుపడితే యీ తతంగం మొదలైంది.

అందుకే సావిత్రి సావిత్రమ్మలా పెళ్ళి కూతురైంది!!

అందరూ వచ్చారు. హడావిడిగా, సందడి, సంతోషం.

శుభకార్యం కాస్త పూర్తయింది.

శ్రీదేవి భర్తతో పాటు ఆనందంగా నవ్వుతూ, ఆ శుభసమయంలో అత్తామామల పాదాలకు నమస్కరించి దీవెనలు అందుకుంది.

నేను మాత్రం ఏడుపు ఆపుకోలేకపోయాను. ఎందుకంటే అంతమందిలో అందరి సమక్షంలో నాయుడు సావిత్రమ్మ చెయ్యందుకుని నా దగ్గరకు వచ్చాడు. నా కాళ్ళకి దణ్ణం పెట్టాడు. అందుకే ఆ సంతోషం ఆపుకోలేక అందరి ముందు ఏడ్చేశాను. వాళ్ళిద్దరిని దగ్గరకు తీసుకున్నాను.

ఆ రాత్రి శోభనం పెళ్ళి కొడుకూ కూతురూ ఒక గదిలో పడుకుంటే మరో గదిలో మామూలుగా పడుకున్నట్లు శ్రవణ్ తన భార్యతో పడుకున్నాడు.

నేను ముసలిదాన్ని, మధ్య గదిలో ఒక మూలలో ఒదిగి పడుకున్నాను.

మధ్యరాత్రి అకస్మాత్తుగా మెలకువ వచ్చేసింది.

నాయుడు కూడా లేచినట్లున్నాడు. సావిత్రమ్మతో కలసి బైటకి వచ్చాడు.

శ్రవణ్ గదిలోంచి మాటలు బిగ్గరగానే వినిపిస్తున్నాయి.

ఎన్నడూ లేనిది శ్రవణ్ భార్యతో వాదన పెట్టుకున్నాడు.

సావిత్రమ్మ కంగారు పడిపోయింది. మొగుణ్ణి తీసుకుని కిటికీ దగ్గరకు వెళ్ళింది.. నేనూ వాళ్ళ వెనకాల వెళ్ళి నిల్చున్నాను.

శ్రీదేవి అంటోంది.."మీరు పెళ్ళికాక ముందు త్రేతాయుగం నాటి శ్రవణ్‌కుమార్‌లా వున్నారు. బాగానే వుంది. ఇప్పుడు మీకు భార్య ఉంది. మీకూ ఒక సంసారమంటూ వుంది. భవిష్యత్తు ఉంది. మనకు పుట్టబోయే పిల్లల కోసమైనా మనం జాగ్రత్త పడాలి" అని.

"అయితే ఏమంటావ్?"

"ఇహ నా వల్లకాదు. ఆ ముసలి వాళ్ళకి అడ్డమైన సేవలు, చాకిర్లు చేసే శక్తి నాకు లేదు.




"చావు"కి బాజాలెందుకు?

"అప్పు" ఇచ్చిన వాళ్లు ఘొల్లుమని ఏడవడానికి!

* * *

కన్నూ, కన్నూ కలిస్తే...?

తర్వాత పని "ఒళ్ళూ-ఒళ్ళూ" నిర్ణయించుకుంటాయి!

* * *

"బస్"కి "కండక్టర్" ఎందుకు?

"పర్స్"ని "చిల్లర"తో నింపుకోవడానికి!

* * *

విగ్రహానికి "ఆగ్రహం" వస్తే...?

"నిగ్రహం" గంగలో కలుస్తుంది!

* * *

"బైరాగి" సంసారం"లో పడితే...?

మిగిలిపోయిన "బూడిద"తో "పళ్ళపొడి పొట్లాలు" కట్టుకుని బ్రతకొచ్చు!

* * *

"వరకట్నం" దేనికి?

దానిపై వచ్చే "వడ్డీ"తో "భార్య"ను పోషించడానికి!

* * *

"మనిషి"కి రెక్కలుంటే...?

బస్‌లూ, రైళ్లూ "అటక" ఎక్కుతాయి!

* * *

పుస్తకాలకి "బైండింగ్" ఎందుకు?

తల క్రింద పెట్టుకుని పడుకోడానికి!

* * *

"పెళ్ళి" కాగానే తెలుసుకోవలసినది?

అప్పు యిచ్చే వాళ్ళ "జాబితా"!

* * *

నేటి రోజులను బట్టి "చిట్ ఫండ్ కంపెనీ" కి ఏం పేరు పెడితే బాగుంటుంది?

"శఠగోపం చిట్‌ఫండ్ కంపెనీ"

నా వల్ల కాదంటే కాదంటున్నా. ఏది ఏమైనా మనం స్వంత ఇల్లు కట్టుకుని విజయవాడలో కాపురం పెట్టాల్సిందే. కావాలంటే మీ వాళ్ళకి నెలకి వెయ్యి రూపాయలు పారేద్దాం. అంతేగానీ జీవితాంతం నన్నిలా ఉండమంటే నేనుండలేను. నేను మీ భార్యని. పెళ్ళినాడు నాతి చరామి అని ప్రమాణం చేసిన మీరు నా మాట వినాల్సిందే. లేకపోతే...."

"ఆ లేకపోతే...."

"ఇవన్నీ మాటలు అనవసరం. నేను కావాలో లేక ఆ ముసలి వాళ్ళు కావాలో తేల్చుకోండి...."

శ్రీదేవి మాటలు పూర్తవకముందే ఆమె చంప ఛెళ్ళుమన్నట్లు వినిపించింది. అంత చీకట్లో కూడా సావిత్రమ్మ గొంతు వణుకుతోంది. ఆ వణుకులో వంటిని కాల్చివేసే బాధ కనిపిస్తోంది.

శ్రవణ్ భళ్ళున నవ్వాడు. నవ్వుతున్నాడు.. ఇంకా నవ్వుతూనే వున్నాడు...

"ఏంటి? నా మాటలు మీకు నవ్వు తెప్పిస్తున్నాయా?" అంటోంది శ్రీదేవి.

"బాగుంది. చాలా బాగుంది. చూడు శ్రీదేవి! నువ్వు నీ గతం మర్చిపోయావా? మూడు పూటలు తిండి లేనిదాన్ని కోడలుగా తెచ్చుకున్నారు మావాళ్ళు. అందుకు ప్రతిఫలం ఇదా నువ్వు వాళ్ళకి ఇచ్చేది? చూడూ! నువ్వేకాదు ఆ దేవుడే దిగివచ్చి నన్ను నాతల్లిదండ్రుల నుంచీ వేరయిపొమ్మంటే తన్ని తగలబెడతాను... గుర్తుంచుకో... ఇక నీ సంగతంటావా? ఇలాంటి నికృష్టపు కోరికలు కోరే భార్య లేకపోతేనే మంచిది. నువ్వు నీ పుట్టింటికి వెళ్ళిపో.... హాయిగా అప్పటిలాగే కోమట్ల ఇంటిలో అంట్లు తోముతూ బ్రతుకు. కావాలంటే నెలకి ఆ వెయ్యి రూపాయలు నీకు పంపిస్తాను. సంస్కారము లేని పెళ్ళానికి సానిదానికి తేడా లేదు. వెళ్ళు... వెళ్ళి గమ్మున పడుకో... రేపే నీ పుట్టింట్లో దిగబెడతాను..." శ్రవణ్ మాటల్లో న్యాయముంది..

కొడుకు మాటలు విన్న సావిత్రమ్మ భోరున ఏడ్వడం మొదలుపెట్టింది. శ్రవణ్ తల్లి ఏడుపు వింటాడని నాయుడు ఆమెని తన గదిలోకి లాక్కెళ్ళాడు... వెనకాలే నేనూ వెళ్ళాను.

"ఊర్కో.......ఊర్కో......వాడు వింటాడు..." అంటున్నాడు నాయుడు.

"వద్దు... ఏడ్వకు నీ కొడుకు మాటలు విన్నావుగా... నీ కొడుకుని నీ నుంచీ ఎవ్వరూ విడదీయలేరు.... ఏడ్వకు తల్లీ...." అన్నాను అనునయంగా..

"ఇది ఏడుపు కాదు వదినా! ఆనందం... వాడు నా కొడుకు... విన్నావా? నువ్వూ విన్నావుగా... ఆ దేవుడు కూడా మమ్మల్ని విడదీయలేడంటా... ఏవండీ! మీరు విన్నారు కదూ.... వాడు నా కొడుకండి..." సావిత్రమ్మ పిచ్చిగా మాట్లాడుతున్నట్లు చెప్పిన మాటే

**(38వ పేజీ చూడండి)**

# విషాదమే దేవుడి? వినోదమా

(35వ పేజీ తరువాయి)

చెబుతోంది... కాసేపు నాయుడ్ని వాటేసుకుని ఏడుస్తోంది. ఇంకాసేపు నన్ను కౌగిలించుకుని కన్నీళ్ళు పెట్టుకుంటోంది...

నాయుడు మాట్లాడంలేదు... నిలువెల్లా నిశ్శబ్దమైపోయాడు... ఎక్కడో చూస్తున్నాడు.. ఏదో ఆలోచిస్తున్నాడు.... అదేమిటో అదోలాంటి భావం నాయుడి ముఖంలో నేనెప్పుడూ చూడలేదు.

సావిత్రమ్మ ఏడుస్తూనే నిదురబోయింది...

ఇహ వాళ్ళిద్దరు పడుకుంటారని నేను ఆ గదిలో నుంచీ వచ్చేశాను. శ్రీదేవిని తిట్టుకుంటూ నిద్రలోకి జారిపోయాను.

ఉన్నట్టుండి నాయుడి కేకలు విని దిగ్గున లేచాను... కీళ్ళనొప్పులు,వెంటనే లేవ లేక మెల్లిగా వాళ్ళ గదిలోనికి వెళ్ళాను..

సావిత్రమ్మ మంచం మీద పడుకోనుంది. నాయుడి పిచ్చిగా ఆమె మీద ఒరిగి ముద్దు పెట్టుకుంటున్నాడు.. మళ్ళీ మధ్యలో రెండు చేతుల్తో తలని బాదుకుంటున్నాడు.

"సావిత్రీ! ఇది నీకు న్యాయం కాదే. నువ్వు లేకుండా నేనెట్లా బ్రతికేది? లే... సావిత్రీ! నన్ను చూడు.... నాకోసమైన లేచి కూర్చో... లేకపోతే నేను దిక్కులేని అనాధనైపోతాను.. లే, సావిత్రి... ! లే..." అంటూ నన్ను చూడగానే ..."అక్కా! చూడక్కా! సావిత్రి ఎంత మోసం చేసిందో...చూడక్కా! నన్నొంటిగా వదిలేసి వెళ్ళిపోయింది.... రాత్రి మధ్యలో లేపి ఒకే ఒక మాట అందక్కా.... ఏవండీ! మనం అదృష్టవంతులమండీ... ఏ జన్మలో పుణ్యం చేసుకున్నామో ఇట్లాంటి సంస్కారవంతుడు మన కొడుకుగా పుట్టాడు... వాడు మన బంగారుకొండ... అన్నది... అంతే... పడుకున్నది పడుకున్నట్లే పోయిందక్కా..... అయ్యో! నేనిప్పుడేం చేసేది? సావిత్రి లేకుండా నేనెట్లా బ్రతికేది?" నా వళ్లో తలపెట్టి పసిపిల్ల వాడిలా ఏడుస్తుంటే....దుఃఖం ఆపుకోలేక బిగ్గరగా ఏడ్చేశాను....

శ్రవణ్ పరుగెత్తుకుని వచ్చాడు.... శ్రీదేవి నెమ్మదిగా వచ్చింది..సావిత్రమ్మని చూసి ఇద్దరూ ఏడ్వటం మొదలుపెట్టారు....

ఊరందరికీ తెలిసిపోయింది... ఇంత హఠాత్తుగా పోయిందేమిటబ్బా అని ఒకరంటే... పుణ్యాత్మురాలు పునిస్త్రీ చావు చచ్చిందని మరొకరు అంటున్నారు.

నిజంనాకు తెలుసు. నిజం నాయుడుకి తెలుసు.... నిజం కొడుకూ కోడలికి తెలిసిపోయింది...

కొడుకు మంచివాడు సంస్కారవంతుడనే సంతోషమే ఆమె ప్రాణాలను తీసింది... సంతోషం కూడా హాని చేస్తుందా?... అదిప్పుడే తెలుసుకున్నాను... సంతోషానికి విషాదానికి ఎంతదూరం? అది దేవునికెరుక. అది వాడు ఆడుకునే ఆటలు...

సావిత్రమ్మ మళ్ళీ పెళ్ళికూతురిలా తయారైంది.. కాదు... సావిత్రమ్మని కడసారి వీడ్కోలు కోసం పెళ్ళికూతురిలా తయారు చేశారు...

"సావిత్రమ్మ మళ్ళీ పెళ్ళి కూతురైంది!! మాటి మాటికి అప్రయత్నంగా నాలో నేనే గొణుక్కుంటున్నాను....

సావిత్రమ్మ పెళ్ళి కూతురై మెట్టినింటి నుంచీ మట్టిలోకి వెళ్ళిపోతుంది...

విషాదం కూడా విషాదంతో మెల్లిగా వణికిపోతోంది....

అందుకేనేమో!

విషాదమంటే దేవుడికి వినోదం కాబోలు!!

